క్లుప్తంగా

డీఏ, పీఆర్‌సీలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న అసోసియేషన్ సభ్యులు

కొత్తగూడెంఅర్బన్: పెన్షనర్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్‌సీలను వెంటనే విడుదల చేయాలని పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు యల్.రాములు కోరారు. సోమవారం కొత్తగూడెంలోని మధురబస్తీలోని అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సర్వ సభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. సీహెచ్ రాజశేఖర్, జె.నారాయణరావు, రాయల సత్యనారాయణ, అంకం పాపయ్య, టి.కోటేశ్వరరావు, ఎస్.సుబ్బారావు, జీఎంవీ ప్రసాద్, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా అందరికీ ఇళ్లు



మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

చుంచుపల్లి: దశలవారీగా అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం విద్యానగర్ పంచాయతీ పరిధిలో పలువురు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు హక్కుపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సూచనల మేరకు లబ్ధిదారుల ఎంపిక జరిగిందన్నారు. పేదలకు న్యాయం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ సుభాషిణి, సీఐ రాయల వెంకటేశ్వర్లు, నాయకులు వాసిరెడ్డి మురళి, సెక్రటరీ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల మంజూరులో అవకతవకలు

సుజాతనగర్: ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అవకతవకలు జరిగాయంటూ ఆయా గ్రామాల్లో పలువురు లబ్ధిదారులు సోమవారం తెలిపారు. స్టేషన్ బేతంపూడి, కొత్త అంజనాపురం, జామ్లాతండా గ్రామాల్లో అనర్హులకు ఇళ్లు మంజూరు అయ్యాయని పలువురు వాపోయారు. అన్ని అర్హతలు ఉన్నా తమకు ఇళ్లు మంజూరు చేయకపోవడం ఏంటని ప్రశ్నించారు. అనర్హుల పేర్లు తొలగించి అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా, ఇళ్లు మంజూరు కోసం తమ వద్ద కమిటీ సభ్యులు డబ్బులు తీసుకున్నారంటూ స్టేషన్ బేతంపూడికి చెందిన కొందరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అందజేశారు.

అర్హులకు ఇళ్లు ఇవ్వాలి

పాల్వంచరూరల్: అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని సేవాలాల్ సేన మండల అధ్యక్షుడు ధర్మసోత్ పవన్‌కల్యాణ్ డిమాండ్ చేశారు. సోమవారం రంగాపురం గ్రామ పంచాయతీ ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అవతకవకలు జరిగాయని, అర్హతలేని, భూమి కలిగిఉన్న వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారని, కలెక్టర్ స్పందించి విచారణ జరపాలని సోమవారం కార్యదర్శికి వినతిపత్రం అందించారు.

ఇఫ్టూ ఇల్లెందు ఏరియా కమిటీ ఎన్నిక

ఇల్లెందు: ఎన్డీ అనుబంధ ఇఫ్టూ ఇల్లెందు ఏరియా మహాసభ సోమవారం ఇల్లెందులో జరిగింది. ఇఫ్టూ జిల్లా కార్యదర్శి కె.సారంగపాణి మాట్లాడుతూ.. కార్మికులు తమ హక్కుల కోసం పోరాటాలు చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా నూతన ఏరియా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా రావూరి ఉపేందర్‌రావు, డి.మోహన్‌రావు, ఉపాధ్యక్షులుగా కొప్పుల శ్రీనివాస్, చారి, సహాయ కార్యదర్శి నరాటి వెంకటేశ్వర్లు, కొండపల్లి శ్రీనివాస్, కోషాధికారిగా సామేల్‌తో పాటు 18 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో రాసుద్దీన్ పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

సుజాతనగర్: నాటిన మొక్కలను ఎప్పటికప్పుడు సంరక్షించాలని తహసీల్దార్ వనం కృష్ణప్రసాద్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా స్థానిక శివాలయంలో సోమవారం ఆయన మొక్కలు నాటి మాట్లాడారు. మొక్కలే మానవ మనుగడకు శ్రీరామరక్ష అని తెలిపారు. కార్యక్రమంలో డీటీ నాగరాజు, ఈఓ హరిశ్చంద్రశేఖర్, అర్చకులు జనార్దనశర్మ, నాయకులు బొడ్డు కేశవరావు పాల్గొన్నారు.

అటవీ శాఖ ఆధ్వర్యంలో..

టేకులపల్లి: అటవీశాఖ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో వనమహోత్సవం నిర్వహించారు. అటవీ శాఖ అధికారి ముక్తార్ హుస్సేన్ ఆధ్వర్యంలో వివిధ రకాల మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓలు బి.శ్రీను, ఎం.హత్తిరాం, ఎఫ్‌బీఓలు పవన్‌కుమార్, సున్నం నగేశ్, రాంసింగ్, గ్రామస్తులు ఇస్లావత్ రెడ్యానాయక్, వీరభద్రం, మాలోతు మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా సాగు పనులు

- వరి, పత్తి, మొక్కజొన్న వైపు రైతుల చూపు
- నాణ్యమైన విత్తనాలు వాడాలని వ్యవసాయ అధికారుల సూచన



టేకులపల్లిలో పత్తి చేనులో పాటు చేస్తున్న రైతు

టేకులపల్లి: మండలంలో తొలకరి వానలకు వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. వరి, పత్తి , మొక్కజొన్న సాగు వైపు రైతులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. కొందరు తొలకరిలో సాగు పనులు మొదలు పెట్టగా, మరి కొందరు వర్షాల కోసం ఎదురు చూస్తూ కొద్దిరోజులుగా కురుస్తున్న వానలకు పనులు ముమ్మరం చేశారు. పత్తి మొలకలు రావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత సీజన్‌లో వరి, పత్తి, మొక్కజొన్న, మిర్చి, పామాయిల్, పెసర, మినుములు, కందులు అన్నీ కలిపి 53,544 ఎకరాల్లో సాగు చేస్తే ఈ సీజన్‌లో 56,060 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. గత సీజన్‌లో అనుభవాలను దృష్టిలో ఉంచుకుని మిర్చి 2,835 ఎకరాల్లో సాగు చేస్తే ఈ సీజన్‌లో మాత్రం 1,500 ఎకరాల్లో మాత్రమే సాగు చేస్తుండటం గమనార్హం. వరి, పత్తి, మొక్కజొన్న, పామాయిల్, పెసర్లు, కందులు గత సీజన్ కంటే ఈ సీజన్‌లో అధిక మొత్తంలో సాగు చేస్తున్నారు.

అప్రమత్తత అవసరం

ప్రస్తుతం ఎక్కడ చూసినా నకిలీ విత్తనాల బెడద రైతన్నలను కలవరపెడుతోంది. ఈ క్రమంలో సాగు కోసం విత్తనాల ఎంపిక, ఎరువులు, పురుగుమందుల కొనుగోలు, వాటి వినియోగంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత కీలకం. రైతులు వ్యవసాయంలో విజయం సాధించాలంటే నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ఎంపిక తప్పనిసరి అని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. నాణ్యమైన ఇన్‌పుట్‌లను ఎంచుకోవడం, పర్యావరణ అనుకూల పద్ధతులను అవలంబించడం, స్థానిక వ్యవసాయ అధికారుల సలహాలను పాటించడం ద్వారా రైతులు అధిక దిగుబడులను సాధించవచ్చు.

టేకులపల్లి మండలంలో వానాకాలం ప్రణాళిక వివరాలు

వానాకాలం	2024-25	2025-26	
పంటలు	సాగు ఎకరాలు	సాగు ఎకరాలు	సాగు ఎకరాల తేడా
వరి	6196	6500	+304
పత్తి	31655	33000	+1345
మొక్కజొన్న	12148	12500	+352
మిర్చి	2835	1500	-1335
పామాయిల్	800	1000	+200
పెసర్లు	37	60	+23
మినుములు	05	00	00
కందులు	668	1500	+832
మొత్తం	53544	56060	+2516

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వానాకాలం సీజన్‌లో లాభసాటి వ్యవసాయం, యాజమాన్య పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై టేకులపల్లిడ్డో నీరుడు అన్నపూర్ణ పలు సూచనలు చేశారు.
- ప్రస్తుతం పత్తి, మొక్కజొన్నలో యూరియా వాడటం సరైన పద్ధతి కాదు. గింజ నుంచి మొట్టమొదటగా వేరు వ్యవస్థ వస్తుంది కనుక వేర్లు అభివృద్ధి చెందడానికి భాస్వరం అవసరం ఉంటుంది.
- తొలకరి దశలో డీఏపీ 20:20:0:13, 28:28:14:35:14 వంటి ఎరువుల్లో నత్రజని, భాస్వరం, పొటాష్ కూడా ఉంటుంది కాబట్టి వాటికి యూరియా కలపొద్దు.
- గింజ వేసిన 25 రోజులకు నానో యూరియా పిచికారీ చేసుకోవాలి. ముందస్తుగా ఎరువులు వేయవద్దు.
- పంట 65 రోజుల తరువాత నుంచి మాత్రమే దఫాల వారీగా యూరియాను వాడుకోవాలి. 45 కేజీల యూరియాను రెండు దఫాలుగా అంటే 22 కేజీల యూరియా 65 రోజులకు ఒకసారి, 85 రోజులకు మరోసారి పొటాష్‌తో పాటు వేసుకోవాలి.
- పంటలకు నత్రజనిని పచ్చిరొట్ట, అజొల్లా, సేంద్రియ ఎరువుల రూపంలో వాడాలి. మండలానికి ఈ నెల 15 వరకు 230 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, 180.5 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంది.

పొలం పనుల్లో అన్నదాత

ఇల్లెందురూరల్: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో అన్నదాతతో దోబూచులాడిన వరణుడు ఎట్టకేలకు కరుణించాడు. కొంత ఆలస్యమైనా ఆశించిన వర్షాలు కురుస్తుండటంతో అన్నదాత మోమున చిరునవ్వు తాండవిస్తోంది. విత్తుకున్న పత్తి, మొక్కజొన్న విత్తనాలు మొలకలుగా మారడం, తాజాగా అడపాదడపా కురుస్తున్న వర్షాలు సాగుకు అనువుగా ఉండటంతో రైతులు ఆనందంగా పొలం పనుల్లో గడుపుతున్నారు. కొందరు రైతులు దుక్కులు సిద్ధం చేసుకుంటూ విత్తనాలు విత్తుకునే పనిలో నిమగ్నం కాగా మరికొందరు మొలకలు ఎదుగుతున్న చేలల్లో కలుపు నివారణ, ఎరువులు వేసుకోవడం వంటి పనులు ప్రారంభించారు. వరినాటు కూలీ రేట్లు భారీగా పెరగడంతో ఈదఫా రైతులు వరిలో వెదజల్లే పద్ధతికి మొగ్గు చూపుతున్నారు. దీనికోసం ప్రస్తుతం కురుస్తున వర్షాలు అనువుగా ఉండటంతో దుక్కులు సిద్ధం చేసుకుంటూ విత్తనాలు సేకరించే పనులలో నిమగ్నమయ్యారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న సెర్ప్ ఏపీఎం దుర్గారావు

ఇల్లెందురూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సామాజిక భద్రత పథకాలను పొదుపు సంఘాల మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సెర్ప్ ఏపీఎం దుర్గారావు అన్నారు. మండలంలోని కొమరారంలో సోమవారం దర్తి ఆబా జన్ భగీధరి అభియాన్ అవగాహన, లబ్ధి పరిపూర్ణ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 నుంచి 70 ఏళ్ల మధ్య వయస్కులు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకానికి అర్హులని, ప్రీమియం కింద రూ.20 చెల్లిస్తే రూ.2 లక్షల వరకు ఇన్సూరెన్స్ లభిస్తుందన్నారు. 18 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్కులు ప్రధాన మంత్రి జీవనజ్యోతి అభియాన్ పథకానికి అర్హులని, ప్రీమియం రూ.436 చెల్లిస్తే ఏడాదికి రూ.2 లక్షలు ఇన్సూరెన్స్ లభిస్తుందని వివరించారు. సమావేశంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ ప్రశాంత్, సెర్ప్ సీసీలు కొమ్మాలు, రాంమ్మూర్తి, వీవోఏలు మంజుల, సుమలత, సురేశ్, అనిత, నరేశ్, రమేశ్, గ్రామ సంఘం అధ్యక్షురాలు పుణ్యవతి పాల్గొన్నారు.

కొరత లేకుండా చూడాలి

జూలూరుపాడు: రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలని బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ నాయకుడు లకావత్ గిరిబాబు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రైతులకు సకాలంలో సరిపడా ఎరువులు ఇవ్వలేని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. ఎరువుల కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎరువుల కొరతను ఆసరాగా చేసుకొని దళారులు బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు అమ్ముతున్నారని, ఈ విషయంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని ఆయన కోరారు.

పరిమిత వేగంతో వాహనాలు నడపాలి



మాట్లాడుతున్న ఏరియా జీఎం శాలేంరాజు

సింగరేణి(కొత్తగూడెం): గనులు, ఉపరితల గనుల్లో పరిమిత వేగంతో వాహనాలు నడపాలని డ్రైవర్లకు జీఎం ఎం.షాలేంరాజు సూచించారు. మైన్స్ ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్ (ఎంవీటీసీ)లో ఈపీ ఆపరేటర్లు, మోటార్ వెహికిల్ డ్రైవర్లకు సోమవారం భద్రతపై అవగాహన నిర్వహించారు. విధి నిర్వహణలో సెల్‌ఫోన్ వినియోగించొద్దని జీఎం సూచించారు. అనంతరం జీఎం (సేఫ్టీ) సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం కోటిరెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, గుర్తింపు సంఘం నాయకుడు మల్లికార్జున్‌రావు, జీకేఓసీ పీఓ ఎం.శ్రీరమేశ్, ఏరియా ఇంజనీర్ కె.సూర్యనారాయణ, డీజీఎంలు ఎస్.విజయ్‌కుమార్, జీవీ మోహన్‌రావు(పర్సనల్), ఏరియా సేఫ్టీ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వరరావు, ఎంవీటీసీ మేనేజర్ జి.లక్ష్మణ్, ఎంవీటీసీ ఆఫీసర్ కలవల చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

ఉద్యమకారుల ఆందోళన



నిరసన తెలుపుతున్న ఉద్యమకారులు

కొత్తగూడెంటౌన్: ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించకుంటే కలెక్టరేట్ ధర్నాచౌక్ వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాసరావు హెచ్చరించారు. సోమవారం కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సమితి జిల్లా కార్యదర్శి కేజీఎస్ మాథ్యూస్ ఆధ్వర్యంలో 60 మంది ఉద్యమకారులు అంబేడ్కర్ విగ్రహం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాంచందర్, కామేశ్వరావు, కె.కొమరయ్య, గౌస్, సీతారాం, జి.లక్ష్మీనారాయణ, పి.వీరస్వామి, పురుషోత్తం, డి.నాగేశ్వరరావు, సాంబయ్య, మల్లయ్య, దామరకొండ మల్లయ్య, కొమరయ్య, తిప్పన సైదులు, ఎ.రాజయ్య, సర్వోత్తమ్ పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి



మాట్లాడుతున్న ఫహీందాదా

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్‌కే ఫహీందాదా డిమాండ్ చేశారు. స్థానిక శేషగిరి భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదట జూలూరుపాడులో జరిగిన ఏఐవైఎఫ్ జిల్లా మహాసభలలో ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా యు.హరీశ్, కార్యదర్శిగా ఎస్‌కే ఫహీందాదా, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్.సతీశ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జె.ఉపేందర్, సహాయ కార్యదర్శులుగా ఎస్‌కే ఖయ్యూం, అనుముల సాయి, చాంద్‌పాషా, కర్లపూడి సుందర్‌లాల్, ఎస్‌డీ జకీర్, అశోక్‌కుమార్, ఉపాధ్యక్షులుగా మోతె కృష్ణ, చంద్రగిరి ప్రసాద్, జహూర్, బరిగెల భూపేశ్, యు.నాగరాజు, అనిల్‌యాదవ్‌తో పాటు మరో 12 మంది కార్యవర్గ సభ్యులు, 42 మంది జిల్లా కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో విద్య, వైద్యం, ఉపాధి కోసం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహిస్తామని వివరించారు.

సబ్ జైలు బస్తీలో ఒకరికి మలేరియా

ఇల్లెందు: పట్టణంలోని సబ్ జైలు బస్తీలో ఎనిమిదేళ్ల బాలికకు మలేరియా సోకింది. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆ ఇంటి చుట్టు పక్కల ఇళ్లల్లో సర్వే నిర్వహించి ముందస్తు చర్యలు ముమ్మరం చేశారు. సబ్ జైలు బస్తీకి చెందిన ఎనిమిదేళ్ల బాలికకు జ్వరం రాగా వైద్యశాలలో పరీక్షలు చేయించగా మలేరియా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. సమాచారం అందుకున్న మలేరియా సబ్ యూనిట్ హరికృష్ణ ఆధ్వర్యంలో వైద్యాఆరోగ్యశాఖ సిబ్బంది బాలిక ఇంట్లో వారితోపాటు చుట్టు పక్కక్కల 51 మందికి పరీక్షలు నిర్వహించారు. బాలికకు మెరుగైన వైద్యం అందిస్తున్నారు. హరికృష్ణ వెంట హెచ్ఈ పరంగిణి, ఏఎన్ఎంలు అరుణ, సింధు, ఆశ వర్కర్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

జూలూరుపాడు: మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు చెంగల గురునాథం జెండాను ఆవిష్కరించారు. మంద కృష్ణ మాదిగ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. దిబ్బెందుల సాయికుమార్, చాపలమడుగు నరసింహారావు, దామెర్ల శ్రీకాంత్, ఇడుపుల రాజు, కంచపోగు నరసింహారావు, తంబర్ల నరసింహారావు, నీలాల ప్రదీప్, నల్లగట్ల రాము పాల్గొన్నారు.

టేకులపల్లి: ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావం, అధినేత మంద కృష్ణమాదిగ 60వ పుట్టిన రోజు వేడుకలు సోమవారం మండల కేంద్రంలో నిర్వహించారు. సంఘం జెండా ఆవిష్కరించి, కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో మచ్చ ఏడుకొండలు, మంతెన ప్రభాకర్, నారపొంగు దేవేందర్, జినక ఇస్తారి, ఇస్లావత్ రెడ్డి, వెంకటేశ్వర్లు, జనక సత్యం, జనక బాబు, సోమయ్య, గుగ్గిళ్ల శంకర్, గుగ్గిళ్ల వెంకన్న, బండారి శ్రీను, గుగ్గిళ్ల మణమ్మ, జినక యశోద పాల్గొన్నారు.

పోలీసులకు ఫిర్యాదు

పాల్వంచరూరల్: బాల కార్మికుడితో పనులు చేయిస్తున్న సాయి వర్షిణి హోమ్ ఫుడ్స్ యజమానిపై చర్యలు తీసుకోవాలని జిల్లా బాలల సంరక్షణ విభాగం అవుట్ రిచ్ వర్కర్ సూరపాక లత పట్టణ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా పాల్వంచ సబ్ డివిజన్ టీమ్‌తో బాల కార్మికుల కోసం తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లోని సాయి వర్షిణి హోమ్ నీడ్స్ ఫుడ్స్ యజమాని ఆలపాటి హరిప్రసాద్ నవభారత్ గాంధీనగర్‌కు చెందిన బాలుడు (16)తో రెండు నెలలుగా రోజుకు రూ.200 చొప్పున ఇచ్చి పనిచేయించుకుంటున్నాడని తేలింది. మరో టిఫిన్ సెంటర్ యజమాని బొల్లేరుగూడెంనకు చెందిన బాలుడితో పనిచేయించుకుంటున్నట్లు గుర్తించారు. దీంతో యజమానులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సబ్ మార్కెట్ యార్డు పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

టేకులపల్లి: స్థానిక సబ్ మార్కెట్‌యార్డును ఇల్లెందు మార్కెట్ కమిటీ చైర్మన్, కార్యదర్శులతో కలిసి మార్కెటింగ్ శాఖ ఖమ్మం డీఈ ఎల్లేశ్ సోమవారం సందర్శించారు. ఈ నెల 1న అభివృద్ధి చేస్తే ఆదాయం అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి మార్కెటింగ్ శాఖ అధికారులు స్పందించారు. యార్డులో సీసీ ఫ్లోరింగ్, రైతులకు టాయిలెట్లు, కార్యాలయం, ప్రవేశ ద్వారం వద్ద ఆర్చ్ నిర్మాణానికి కావాల్సిన కొలతలు తీసుకున్నారు. నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బాణోతు రాంబాబు, సభ్యురాలు జారసమ్మక్క, స్పెషల్ గ్రేడ్ కార్యదర్శి వి.సుచిత్ర, గ్రేడ్‌-3 కార్యదర్శి ఇ.నరేశ్‌కుమార్, పాల్గొన్నారు.

'ఆధార్' క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోండి

పాల్వంచరూరల్: కలెక్టరేట్‌లో ఈ నెల 9, 10వ తేదీల్లో రెండు రోజులపాటు కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ చొరవతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంప్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. నూతన ఆధార్‌కార్డు, చిరునామా, తప్పుల సవరణ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

'నా భూమి ఆక్రమించారు'

ఇల్లెందు: బస్‌స్టేషన్‌లో ఆర్టీసీ పెట్రోల్ బంక్, రోడ్డు వైపునకు గోడ నిర్మాణం చేపట్టింది. రోడ్డు వైపు సఫియా అనే మహిళ తన ఖాళీ స్థలంలో గోడ నిర్మిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. సర్వే నంబర్ 527లో 30 గుంటల భూమి ఉందని రెవెన్యూ శాఖ తేల్చిందని, తన భూమిలోకి వచ్చి గోడ నిర్మాణం చేయడం అన్యాయమని వాపోయింది.

'పీఎం కిసాన్' రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

టేకులపల్లి: పీఎం కిసాన్ పథకంలో పేర్లు నమోదు చేసుకోవడం రైతులకు ఎంతో ఉపయోగకరమని ఆత్మ కమిటీ చైర్మన్ బోడ మంగీలాల్‌నాయక్ పిలుపునిచ్చారు. మండలంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పీఎం కిసాన్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. రైతులు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇనుప వంతెన పనులు పూర్తి



ఐరన్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న సిబ్బంది

ఇల్లెందు: ఇల్లెందులపాడు హిందూ శ్మశానవాటిక ఐరన్ బ్రిడ్జి పనులు పూర్తయ్యాయి. గత ఏడాది నవంబర్ 20న పనులకు శ్రీకారం చుట్టారు. 9 నెలల కాలంలో వాగుమీద పిల్లర్లు, దాని మీద ఐరన్ పైపులు, ఐరన్ పైపుల మీద ఐరన్ షీట్ ఏర్పాటు చేశారు. సోమవారం పూర్తిస్థాయిలో ఐరన్ బ్రిడ్జి అందుబాటులోకి వచ్చింది. మున్సిపల్ మాజీ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, అక్కడి మాజీ కౌన్సిలర్ కటకం పద్మావతి బ్రిడ్జిని సందర్శించి పరిశీలించారు. వర్షా కాలంలో మాత్రమే వాగు దాటం కష్టంగా మారినందున ఈ తాత్కాలిక ఇనుప వంతెనను ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, డీఈ మురళి, ఏఈ నవీన్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ నరసింహారావు పనులను పర్యవేక్షించారు. ఐరన్ బ్రిడ్జి పూర్తి కావటంతో ఇల్లెందులపాడు వాసులు హర్షం వ్యక్తం చేశారు.

భక్తి శ్రద్ధలతో మొహర్రం



రామవరం సెంటర్‌లో పీరీల వద్ద భక్తులు

కొత్తగూడెంటౌన్/జూలూరుపాడు/సుజాతనగర్: మండలాల్లోని ముస్లింలు మొహర్రంను భక్తి శ్రద్ధలతో సోమవారం జరుపుకున్నారు. జూలూరుపాడు, పాపకొల్లు గ్రామాల్లో కార్యక్రమాలను పది రోజులుగా ముస్లింలు ఎంతో వైభవంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి పీర్ల సావడీలోని పీర్లు అన్ని లేచి అగ్ని గుండంలో నడిచాయి. దీంతో పీర్ల ఉత్సవాలు ముగిశాయి. సోమవారం పీర్లను గ్రామంలో మేళతాళాలతో ఊరేగించారు.



జూలూరుపాడు: పాపకొల్లులో..



సుజాతనగర్: పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

సీజనల్ వ్యాధులపై అవగాహన



మాట్లాడుతున్న సింగరేణి హెల్త్ ఆఫీసర్ లలిత

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని ఏరియా వర్క్‌షాపులో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం సింగరేణి హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లలిత ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కలుషిత నీరు, ఆహారం, అపరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించటకపోవటంతో పలు వ్యాధులు వస్తాయని తెలిపారు. చేతులు తరుచుగా కడుక్కోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీకాంత్, శంకర్, అనిల్, ఉపేందర్‌బాబు, మధుకృష్ణ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట నిరసనలు



నిరసన తెలుపుతున్న కాంట్రాక్టర్లు

సూపర్‌బజార్(కొత్తగూడెం): మన ఊరు – మన బడి పథకం కింద మంజూరైన అభివృద్ధి పనులను పూర్తి చేశామని తమకు బిల్లులు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం పలువురు కాంట్రాక్టర్లు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు మాట్లాడుతూ పాఠశాల భవనాల మరమ్మతులు, నూతన భవనాల నిర్మాణం, అదనపు గదుల నిర్మాణం, మరుగుదొడ్లు, ఎలక్ట్రికల్, డ్రైయినేజీ, ప్రహరీల నిర్మాణం లాంటి పనులన్నీ చేశామని తెలిపారు. కొత్వాల సత్యనారాయణ, గుగులోత్ లక్ష్మా, దాసరి నాగేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, ముత్యాల ప్రవీణ్‌కుమార్, బి.రవి, సైదులు, ఎం.శ్రీనివాసరావు, ధనుంజయ్ పాల్గొన్నారు.

జీఓ రద్దు చేయాలని..

పది గంటల పని దినాలను అమలు చేయాలని తెచ్చిన జీఓ 282ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి జీఓ కాపీని దహనం చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. కృష్ణ, రమేష్, బండి నాగేశ్వరరావు శంకర్ రెడ్డి, దొడ్డా రవికుమార్, సత్య, తులసీరామ్, వినోద, నిరంజన్, నగేష్, వెంకటేశ్వర్లు, సారంగపాణి, నాగేశ్వరరావు, సంజీవ్, మల్లికార్జున్ పాల్గొన్నారు.